జంక్షన్ జామ్



- ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు
- లబోదిబోమంటున్న దుకాణదారులు
- పట్టించుకోని అధికారులు

మద్దిపాలెం:

మద్దిపాలెం ప్రధాన జంక్షన్ గజిబిజిగా తయారైంది. పోలీసులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్, ఫుట్‌పాత్‌ల ఆక్రమణ వంటివి కొనసాగుతున్నాయి. ఇక్కడ చిరు వ్యాపారులు నడక దారులను ఇష్టానుసారం ఆక్రమించుకుని తోచినట్లు వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్‌కు విపరీతమైన అంతరాయం ఏర్పడుతోంది. ఈ వ్యాపారాల వల్ల సగానికి పైగా రోడ్డు ఆక్రమణకు గురి కావడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇక్కట్లు పడుతున్నారు.

రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులతో మరింత రద్దీ..

మద్దిపాలెం మెయిన్ రోడ్డుకు సమీపంలోనే రైల్వే స్టేషన్ ఉంది. ఇక్కడికి రైళ్లు ఎక్కేందుకు వచ్చే ప్రయాణికుల వల్ల కూడా ఈ ప్రాంతం రద్దీగా మారుతుంది. బీఆర్‌టీఎస్ రోడ్డు కావడంతో అన్ని వేళల్లో ఆర్టీసీ బస్సుల తాకిడి కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇక పండగలు, పబ్బాలు వచ్చాయంటే ఆ రోడ్డు పరిస్థితి చెప్పనే అక్కర్లేదని స్థానికులు అంటున్నారు. ఆక్రమణలు తొలగించాల్సిన జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాల్సిన ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే మొక్కుబడిగా వచ్చి షాపులు తొలగిస్తారు. అది షరా మామూలే అంటున్నారు స్థానికులు. ఓ పక్క తొలగించడం మళ్లీ యథాతథంగా వ్యాపారాలు నిర్వహించడం అలవాటై పోయింది.

దుకాణాల ముందు చిరు వ్యాపారాలు..



మద్దిపాలెం ప్రధాన రహదారిలో అనేక రకాల దుకాణాలు ఉన్నాయి. వాటి ముందు తోపుడుబళ్లు, వాహనాల పార్కింగు వల్ల దుకాణాలకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. చేసేది లేక మిన్నకుండిపోతున్నాం అని చెబుతున్నారు. దుస్తులు, మెడికల్, మిఠాయి, హార్డ్‌వేర్, బేకరీలు, కిరాణా.. ఇలా చాలా రకాల షాపులు ఆ దారిలో ఉన్నప్పటికీ.. వాటి ముందు చిరు వ్యాపారులు అమ్మకాలు సాగిస్తుండడం వల్ల తాము నష్టపోతున్నట్లు ప్రధాన షాపుల వాళ్లు లబోదిబోమంటున్నారు. ఈ సమస్య పరిష్కరించేలా జీవీఎంసీ అధికారులు హాకర్ జోన్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని వ్యాపారులు కోరుతున్నారు. ఏది ఏమైనా ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్య, ఆక్రమణలకు చెక్ పెట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

స్టేడియంలో పాము కలకలం



పోర్టు స్టేడియంలో పట్టుకున్న పామును చూపుతున్న కిరణ్ కుమార్

సీతంపేట: అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో బుధవారం ఉదయం పాము కలకలం రేపింది. స్టేడియంలో ఉన్న స్టాల్ వద్ద పాము కనిపించడంతో అక్కడున్న వారంతా హడలిపోయి పరుగులు తీశారు. స్టేడియం నిర్వాహకులు సమాచారాన్ని స్నేక్ సొసైటీ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌కు తెలియజేశారు. స్టేడియంకు చేరుకున్న కిరణ్‌కుమార్ పామును చాకచక్యంగా పట్టుకున్నారు. అది జెర్రిపోతు అని, ప్రమాదకరమైన పాము కాదని, భయపడవలసిన అవసరం లేదని ధైర్యం చెప్పారు. స్టేడియం వెనుక కొండలు, చెట్లు, పొదలు ఉండటం వల్ల పాములు సంచరించే అవకాశం ఉందన్నారు. ఎక్కడైన పాము కనబడితే తనకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. పామును పట్టుకుని దూరంగా విడిచిపెట్టడంతో అక్కడి వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

7న సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

సీతంపేట: సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా ఈ నెల 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే అదే రోజు ఉదయం 9 గంటలకు పీఠంలో సుబ్రహ్మణ్య పాశుపత అభిషేకం, సర్పశూక్త సహిత పాశుపత హోమం జరుగుతుందని తెలిపారు. పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

క్లుప్తంగా

ఉమానీలకంఠేశ్వరుని హుండీ ఆదాయం రూ.2.31 లక్షలు



హుండీ లెక్కిస్తున్న శ్రీహరి సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు బుధవారం జరిగింది. కార్య నిర్వహణాధికారి బండారు ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో దేవదాయ శాఖ తనిఖీదారు ఎం.శ్రీధర్ పర్యవేక్షణలో హుండీని లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మొత్తం 57 రోజులకు రూ.2.31 లక్షలు వచ్చిందన్నారు. శ్రీహరి సేవా సంఘం సభ్యులు హుండీ లెక్కించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రామారావు శర్మ, ఉమామహేష్, దేవస్థానం సిబ్బంది చంద్రశేఖర్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి

మద్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న ఓ భవనం పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. 49వ వార్డు పట్టాభిరెడ్డి తోట ఎన్‌జీవోస్ కాలనీలో నివాసముంటున్న మామిడి రమణ (48) కూలి పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం 56వ వార్డు తోటవీధి గొల్ల కంచరపాలెంలో నిర్మాణంలో ఉన్న భవనంపై స్లాబ్ పనులు చేస్తుండగా కిందకి దిగుతున్న క్రమంలో జారి పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కంచరపాలెం సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 10.44 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో హుండీలు లెక్కించారు. 32 రోజులకు గాను అమ్మవారికి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ.10,44,345 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. కరకచెట్టు అమ్మవారి దేవస్థానం ఈవో కె.గాయత్రి పర్యవేక్షణలో ఆదాయం లెక్కించారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, కమిటీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో రౌడీషీటర్లకు జైలు

మద్రిపాలెం: కంచరపాలెం తిక్కవానిపాలెం శివాలయం వద్ద 2021లో జరిగిన కొట్లాట కేసులో నలుగురు రౌడీ షీటర్లకు బుధవారం 7వ ఏజేఎఫ్‌సీఎం లలితాదేవి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. గొల్లమండల రాజు, బర్రి తన్మయసాయి, మంత్రి వినయ్, సిమ్మ మణికంఠకు 8 నెలల సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఈ కేసులో మరో నిందితుడు మోహన్ కన్నకు కేవలం జరిమానా మాత్రమే విధించారు. 2021లో జరిగిన ఈ ఘటనలో ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి తుది తీర్పును వెలువరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె. పద్మావతి, కోర్టు కానిస్టేబుల్ సాయిరాంలను ఉన్నతాధికారులు అభినందించారు.

రెవెన్యూ స్థలం ఆక్రమణను అడ్డుకున్న ఆర్‌ఐ

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కనకమ్మ వీధిలో 22ఏలో గల రెవెన్యూ స్థలాన్ని ఆక్రమించి చేపడుతున్న షెడ్ నిర్మాణాన్ని అధికారులు అడ్డుకున్నారు. వార్డులో 133 సచివాలయం పరిధి, కనకమ్మవీధిలో సుమారు రెండు వేల గజాల ఖాళీ స్థలం ఉంది. నగరం మధ్యలో గల కోట్ల విలువైన స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. ఖాళీ స్థలంలో రెవెన్యూ స్థలంగా పేర్కొంటూ గతంలో ఏర్పాటు చేసిన బోర్డును రాత్రికి రాత్రి మాయం చేశారు. మరొకవైపు ఖాళీ స్థలంలో షెడ్ నిర్మాణం మొదలుపెట్టారు. ఈ తతంగంపై పలువురు అర్బన్ ఎమ్మార్వో కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. దీంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమలత సంబంధిత సచివాలయ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని నిర్మాణ పనులను ఆపివేయించారు. ఇది రెవెన్యూ స్థలమని, ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలమని పేర్కొంటూ గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన బోర్డును ఎవరు తొలగించారని విచారణ చేపట్టారు. స్థానిక మహిళ కోర్టులో కేసు వేసామని తెలపడంతో, ఈ స్థలం మీకు చెందినదని కోర్టు ధృవీకరించిన పత్రాలు ఉంటే చూపమని అడగటంతో మా వద్ద పత్రాలు ఏమీ లేవని తెలిపినట్టు సమాచారం. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ తెలిపారు. త్వరలో బోర్డు ఏర్పాటు చేస్తామని, విషయాన్ని అర్బన్ తహసీల్దార్‌కు నివేదిస్తామన్నారు.

29న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సత్యానంద్ తదితరులు

సీతంపేట: ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రెండవ సారి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు స్టార్ మేకర్ సత్యానంద్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్‌లో 14 రాష్ట్రాల నుంచి 84 వేల మంది కళాకారులు ఉన్నారన్నారు. నవంబరు 16న హైదరాబాదులో ఫిల్మ్ స్క్రీనింగ్ నిర్వహించామని, డిసెంబరు 22న విశాఖలో స్క్రీనింగ్ నిర్వహిస్తామనితెలిపారు. కళలకు వేదికైన విశాఖలో ఫెస్టివల్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. 11 అంశాలలో విజేతల పేర్లు వెల్లడించారు. తన వద్ద శిక్షణ పొందిన సంతోష్ డ్యాన్స్‌లో మాస్టర్ డిగ్రీ కోసం అమెరికా వెళ్లి షార్ట్ ఫిల్మ్ చేయడం అభినందనీయమన్నారు. ఈ లఘు చిత్రంలో తాను కూడా నటించానని, సంతోష్ షార్ట్ ఫిల్మ్ అవార్డు కోసం ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షురాలు జాలాది విజయ మాట్లాడుతూ ఎంతో మంది హీరోలకు సత్యానంద్ శిక్షణ ఇచ్చి వెండి తెరకు అందించారన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ సినీ హబ్ గా మారుతుందని, సినీ పరిశ్రమ విశాఖ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫిల్మ్ ఫెస్టివల్‌ను విజయవంతం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌ఎం ప్రతినిధి రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

22న పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా ఏడవ మహాసభలు



మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రతినిధులు

సీతమ్మధార: ప్రగతిశీల మహిళా సంఘం ఏడవ జిల్లా మహాసభలను డిసెంబర్ 22న నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. గాజువాక డ్రైవర్స్ కాలనీలోని గౌరవి సత్యనారాయణ కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణతో సభ ప్రారంభమవుతుందని తెలిపారు. సభా ప్రాంగణానికి బోయి విజయభారతి ప్రాంగణంగా నామకరణం చేసామని పేర్కొన్నారు. మహిళా సంఘాల జాతీయ కోఆర్డినేటర్ ఝాన్సీ ప్రారంభోపన్యాసం చేస్తారని, రచయిత్రి విజయ భారతి స్మారకోపన్యాసం చేస్తారన్నారు. ప్రైవేటీకరణతో ఉపాధి అవకాశాలు కోల్పోతున్న మహిళలు అనే అంశంపై గూడూరు సీతామహాలక్ష్మి ప్రసంగిస్తారని తెలిపారు. మహిళా ఉద్యమ కర్తవ్యాలపై పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, కార్యదర్శి పద్మ మాట్లాడతారన్నారు. మధ్యాహ్నం ప్రతినిధుల సభలో కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్ కార్యక్రమం నిర్దేశించుకుంటామని, నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై వినతి



రవివర్మకు వినతిపత్రం అందిస్తున్న ఎన్‌ఎంయూఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: ఏపీ పీటీడీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పీఎఫ్ సమస్యను తక్షణం పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి కోరారు. విజయవాడలోని ఏపీఎస్ ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేషన్ రవివర్మను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, గ్యారేజీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను వివరించామన్నారు. పీఎఫ్ సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. డిస్పెన్సరీలో మందుల సరఫరా పూర్తిస్థాయిలో లేనందున సిబ్బంది అవసరమైన మందులు పొందలేకపోతున్నామని తెలిపామన్నారు. ఎక్కడి వారికి అక్కడే ఈహెచ్ఎస్ హాస్పిటళ్లకు పంపేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నామన్నారు. సిక్ లీవ్‌లకు ఆ నెలలోనే జీతాలు ఇచ్చేలా, ఏ నెలకు సంబంధించిన ఇంక్రిమెంట్లు ఆ నెలలోనే కలిపేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని రవివర్మ హామీ ఇచ్చారన్నారు. మిగిలిన అంశాలపై సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రావి సుబ్బారావు, రాష్ట్ర కోశాధికారి, పి.వి.వి.మోహన్, విజయవాడ జోనల్ కార్యదర్శి ఎ.రామారావు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ పూజ



లక్ష్మీ పూజ నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ రెజికుమార్

సీతమ్మధార: డాక్టర్ పైలా ఆదిమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గణేష్‌నగర్‌లోని శ్రీ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన ఆలయంలో లక్ష్మీపూజ, దీపారాధన ఘనంగా జరిగాయి. శబరిమల మాలికాపురమాత ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఎం.ఎస్. రెజికుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో 108 మంది మహిళలు విచ్చేయగా త్రిముఖ విఘ్నేశ్వర ఆలయం నుండి మంగళ వాయిద్యాలు, కేరళ డ్రమ్స్, కోలాటంతో బయలుదేరి నరసింహనగర్‌లోని సాయి షణ్ముఖ రెసిడెన్సీలో గల అయ్యప్ప పూజా స్థలానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ టి.ఎస్.ఎన్. మూర్తి, జి. కృష్ణ, ఎం.ఎస్. ప్రకాశరావు, టి. వెంకటరావు, ఎం. రంగారావు, పైలా రమణ, ఎం. సత్యనారాయణ, అయ్యప్ప స్వామి భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలతో ఉపాధ్యాయులపై ఒత్తిడి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు ఆందోళన కార్యక్రమాల నోటీసు అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

విశాఖ విద్య: ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురిచేసేలా ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల నోటీసును బుధవారం జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల పని వేళలు, పదో తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ అంతా అసంబద్ధంగా ఉందన్నారు. విద్యార్థుల అపార్ నమోదు విషయంలో ఉపాధ్యాయులు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో ఆదివారాలు, పండగ దినాల్లో సైతం పనిచేయాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం సరైంది కాదన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారని, ఈ నెల 11న డీఈవో కార్యాలయం ఎదుట, 16న రాష్ట్ర విద్యా శాఖ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శనలు చేపడతామన్నారు. ఉపాధ్యాయులు స్వేచ్ఛగా పనిచేసేలా అధికారుల నిర్ణయాలు ఉండాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, టి.జగన్, జీవీఎంసీ నాయకులు శోభ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఆలయ ఈవో జి.వి. రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు స్వయంగా జలాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకుడు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించి ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి గీతా జయంతి వేడుకలు

- పాల్గొననున్న చినజీయర్‌స్వామి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార: ప్రముఖ ఆధ్యాత్మిక ఆచార్యులు త్రిదండి చినజీయర్‌స్వామి ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకూ విశాఖలో నిర్వహించే గీతా జయంతి వేడుకల్లో పాల్గొంటారని వారిజ ఆశ్రమ కమిటీ, వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ శాఖ ప్రతినిధులు తెలిపారు. సీతమ్మధారలో గల వర్మ కాంప్లెక్స్ (పాత ఈనాడు ప్రాంగణం)లో ఈ వేడుకలు జరగనున్నాయని బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలిపారు. వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ఎస్ఆర్ వర్మ మాట్లాడుతూ ప్రజలంతా సుఖంగా జీవించాలని ఈ వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా డిసెంబర్ 8 ఉదయం 10 గంటల నుంచి శ్రీరామ పాదుకా ఆరాధన, సాయంత్రం నేత్ర విద్యాలయ విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. వారిజ వేద పాఠశాల ఆచార్యులు ముదుంబై శ్రీకాంత్ మాట్లాడుతూ దాదాపు 7 సంవత్సరాల తర్వాత చిన్న జీయర్ స్వామి విశాఖకు వస్తున్నారని అన్నారు. భీమిలి బీచ్ రోడ్డులోని మంగమారిపేటలో గల వారిజ ఆశ్రమంలో ఒక పక్క వేద పాఠశాల, అదే ప్రాంగణంలో దివ్య నేత్రులకు (అంధ విద్యార్థులకు) నేత్ర విద్యాలయ పాఠశాల నిర్వహిస్తున్నారని తెలిపారు. విశాఖలోని ఈ పాఠశాలలో ప్రస్తుతం 10వ తరగతి వరకే ఉందని, రానున్న విద్యా సంవత్సరం నుంచి వారిజ ప్రాంగణంలోనే ఇంటర్, డిగ్రీ కోర్సులను కూడా ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో కంప్యూటర్ల ద్వారా నేత్ర విద్యాలయంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారన్నారు. వారిజ కమిటీ సభ్యులు, ఎంఎస్ రాజు, సాతులూరి రామానుజం, టి. నారాయణరెడ్డి, కాశి రాజు, బుస్కీ మాస్టర్, పీఎస్ఎన్ రాజు, వారిజ వేద పాఠశాల ఆచార్యులు సంతోష్ కుమార్, నేత్ర విద్యాలయ ఇన్‌చార్జి శిరీష తదితరులు పాల్గొన్నారు.

శ్రావ్యంగా ఘంటసాల గీతాలాపన



కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు

సీతంపేట: గాన గంధర్వుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా ఘంటసాల గాననిధి, ఎంవీఆర్ ఈవెంట్స్ సంయుక్తంగా బుధవారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ సంగీత విభావరి నిర్వహించాయి. ఈ సందర్భంగా గాయనీ గాయకులు ఘంటసాల పాడిన హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు. నూకల ప్రభాకర్, గంటి ఉష పాడిన టౌన్ పక్కకెళ్ళొద్దురా, కె.రాజేంద్రప్రసాద్, శశిరాణి పాటిన దివి నుంచి దిగి వచ్చే, శ్రీనివాస్ పాడిన తిరుమల మందిర సుందర, రామ్ నరసింహం, అమ్ము సత్యవతి పాడిన పగటిపూట చంద్రబింబం, ఎంవీఆర్ నాగేశ్వరరావు, ఉదయ భాస్కరి పాడిన వెన్నెలలోన వేడి ఏలనో, పెమ్మ రామ్ ప్రభ పాడిన ఇంగ్లీష్‌లోన మ్యారేజీ గీతాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. ముందుగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోషియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎం.రూపవాణి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

నైపుణ్యం ఉన్న వారికే అపార అవకాశాలు



టెక్ ఫెస్ట్‌లో నమూనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మురళీనగర్: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటేనే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం విశాఖ రీజియన్ స్థాయి పాలిటెక్ ఫెస్ట్–2024ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సబ్జెక్ట్‌పై ఎంత పట్టు ఉన్నా.. సమాచార నైపుణ్యాలు ఉన్నప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. రోజు రోజుకూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మనం మారాల్సి ఉందన్నారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో కంప్యూటర్స్, ఈసీఈ బ్రాంచిలు లేవన్న విషయం తన దృష్టికి వచ్చిందని, వీటిని మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ముందుగా ఆయన ఎలక్ట్రానిక్ విధానంతో సెల్‌ఫోన్ ద్వారా జ్యోతి ప్రజ్వలన, రిబ్బన్ కత్తిరించి ఫెస్ట్‌ను ప్రారంభించారు. దీన్ని రూపొందించిన విద్యార్థులు చైతన్య, పూర్ణ, ఎలక్ట్రానిక్ విభాగం ఉద్యోగి స్టాలిన్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి. విద్యార్థులు రూపొందించిన సాంకేతిక నమూనాలు ఆలోచింపజేశాయి. టెక్నికల్ ఎడ్యుకేషన్ అకడమిక్ డీడీ కె.విజయభాస్కర్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె.నారాయణరావు, డాక్టర్ కె.వెంకటరమణ, హెచ్‌వోడీలు కేడీవీ నరసింహారావు, జె.రాజేంద్రప్రసాద్, కె.రత్నకుమార్, ఎం.హరిబాబు, జె.గోవర్ధన్‌రావు, స్టూడెంట్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు. టెక్ ఫెస్ట్‌లో 8 ప్రభుత్వ, 17 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలకు విద్యార్థులు 192 నమూనాలు ప్రదర్శించారు.